సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



వైభవంగా యత్తప్పస్వామి క్షీరోత్సవం

రొళ్ల మండలంలోని గంతికల్లు గొల్లహట్టిలో యత్తప్పస్వామి ఉత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం క్షీరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 8లో



కిలో టమాట రూ.60

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.60, కనిష్టంగా రూ.35, సరాసరిన రూ.45 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/21.4°

జిల్లా పరిధిలో గురువారం మధ్యాహ్నం వరకు తుపాను వాతావరణం నెలకొంది. ఆ తర్వాత ఉక్కపోత కొనసాగింది. ఆకాశం మేఘావృతమై జిల్లా అంతటా మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు పుట్టపర్తికి కేంద్ర మంత్రి రాక

ప్రశాంతి నిలయం: సత్యసాయి మహా సమాధి దర్శనం కోసం కేంద్ర సమాచార, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ శుక్రవారం పుట్టపర్తికి రానున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు నుంచి ఆయన రోడ్డుమార్గంలో ప్రత్యేక కాన్వాయ్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు పుట్టపర్తి చేరుకుంటారన్నారు. సత్యసాయి మహా సమాధి దర్శనం అనంతరం ఆయన తిరిగి రోడ్డు మార్గాన బెంగళూరుకు బయలుదేరి వెళతారన్నారు. ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ అతిథి గృహంలో ఆయనకు బస ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

జైలు జీవితం మార్పు తేవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

కదిరి: నేరం చేసి జైలు జీవితం గడుపుతున్న ఖైదీల్లో సత్ప్రవర్తన రావాలని ఆశిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సబ్ జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. జైలు జీవితం ముగించుకొని సత్ప్రవర్తనతో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తే ఆ కుటుంబంతో పాటు సమాజం మొత్తం మిమ్మల్ని చూసి హర్షిస్తుంది' అని వివరించారు. అంతకు ముందు సబ్‌జైలు మొత్తం పర్యవేక్షించి అక్కడి వసతులను అడిగి తెలుసుకున్నారు.

చెక్ బౌన్స్ కేసులో రూ. 6 లక్షల జరిమానా

పెనుకొండ: చెక్ బౌన్స్ కేసులో పెనుకొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప రూ.6 లక్షల జరిమానా విధించారు. పోలీసుల వివరాల మేరకు.. గోరంట్ల మండలం పాలసముద్రానికి చెందిన వెంకటనారాయణమ్మకు 2021లో ఏఎస్‌ఎం వడ్డే భారతి అనే మహిళ డబ్బులు ఇవ్వాల్సి ఉండగా చెక్ ఇచ్చింది. చెక్ బౌన్స్ కావడంతో వెంకటనారాయణమ్మ పెనుకొండ కోర్టును ఆశ్రయించగా న్యాయమూర్తి బొజ్జప్ప ఏఎస్‌ఎంకు రూ. 6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఇదే కేసులో నెల క్రితం కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేయగా.. గోరంట్ల పోలీసులు అరెస్ట్ చేయడానికి వెళ్లారు. భారతితో పాటు ఆమె కుటుంబ సభ్యులు దాడి చేశారన్నారు. రొద్దం పోలీసులు కేసు నమోదు చేయగా ప్రస్తుతం వారు రిమాండ్‌లో ఉన్నారన్నారు.

వర్షార్పణం



చిలమత్తూరు: వీరాపురంలో నేల కొరిగిన బొప్పాయి పంట



పుట్టపర్తి: టమాట పంటకు సోకిన వైరస్

పంట చేతికొస్తుందని కోటి ఆశలతో ఎదురుచూస్తున్న రైతులను తుపాను నట్టేట ముంచింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని రైతులు సాగు చేసిన వివిధ పంటలకు తీరని నష్టం వాటిల్లింది.



మడకశిర: కోతకు వచ్చిన మిరప పంటలో నిల్వ ఉన్న వర్షపు నీరు



పుట్టపర్తి: మరువ పారుతున్న సాహెబ్ చెరువు

- తుపాను దెబ్బకు పంటలు కకావికలం
- జిల్లా వ్యాప్తంగా వేరుశనగ, టమాట, మిర్చి, మల్బరీ పంటలకు నష్టం
- వేరుశనగ చేనులోనే కుళ్లిపోతుండటంతో రైతుల కన్నీరు
- ప్రభుత్వమే ఆదుకోవాలంటూ వేడుకోలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాను వర్షాలు ముంచెత్తుతున్నాయి. దీంతో టమాట, వేరుశనగ, మల్బరీతో పాటు ఉద్యాన పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. వేరుశనగ 35 హెక్టార్లు, వరి 25 హెక్టార్లు, పత్తి 10 హెక్టార్లు, మొక్కజొన్న 1 , కంది 2 హెక్టార్లు మొత్తం 73 హెక్టార్లలో పంట నష్టం కలిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. అయితే అంతకు మించే పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది.

32 మండలాల్లో వర్షం

జిల్లాలోని 32 మండలాల్లో భారీ వర్షం నమోదైంది. బుధవారం రాత్రి నుంచి గురువారం వరకూ జిల్లాలోని 32 మండలాల్లో మొత్తం 1745 మి.మీటర్లు, సగటున 54.6 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. అత్యధికంగా పుట్టపర్తిలో 112.8 మి.మీ, కొత్తచెరువులో 110.6, బుక్కపట్నంలో 99.6, పెనుకొండలో 90.2, రామగిరిలో 77.2 , సీకే పల్లిలో 73.8, ముదిగుబ్బలో 71.8 మి.మీటర్ల కురిసింది. అలాగే రొద్దంలో 68.6, నల్లమాడలో 67, గోరంట్లలో 66.8, సోమందేపల్లిలో 63.6, ధర్మవరంలో 63.4, ఓడీ చెరువులో 59, నల్లచెరువులో 54.2, అమరాపురంలో 50.2, గాండ్లపెంటలో 44.6, అమడగూరులో 42.8, తలుపులలో 41.6, గుడిబండలో 41.4, ఎన్‌పీ కుంటలో 41, తనకల్లులో 40.4, కనగానపల్లిలో 39, మడకశిరలో 38.4, రొళ్లలో 36.6, పరిగిలో 34, తాడిమర్రిలో 32.4, బత్తలపల్లిలో 31.8, చిలమత్తూరు 30.2, హిందూపురంలో 27.8, అగళిలో 26.6, లేపాక్షిలో 23.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలోని పలు చెరువులు నిండి మరువలు పారుతున్నాయి.

నివేదికలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: భారీ వర్షాల కారణంగా జిల్లాలో సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టం నివేదికలను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురవారం ఆయన కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ టీఎస్ చేతన్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెనుకొండ, ఆముదాలగుంట, పెనుకొండ చెరువుల నీటి సామర్థ్యం గురించి సంబంధిత అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. హౌసింగ్, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు ఆస్తి నష్టంపై క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు అన్యాయం జరగకుండా నివేదికలను సిద్ధం చేయాలన్నారు.

వర్షానికి పంట నాశనమైంది



వర్షానికి తడిసి కుళ్లిపోతున్న వేరుశనగను చూపుతున్న రైతు గంగాద్రి

బోరు బావి కింద నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాను. ఇందుకుగాను రూ.1.50 లక్ష పెట్టుబడి పెట్టాను. నాలుగు రోజుల క్రితమే పంటను తొలగించాను. మరుసటి దినం నుంచే వర్షం పడటంతో పంట తడిసిపోయి కుళ్లిపోతోంది. పంటకు పెట్టిన పెట్టుబడి సైతం దక్కకుండా పోయింది. పశుగ్రాసానికి కూడా పనికి రాకుండా పోయింది. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. – గంగాద్రి, బత్తలపల్లి

జలమయమైన ఖాద్రీ ఆలయం



కదిరి: భారీ వర్షంతో లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో చేరిన నీరు

కదిరి టౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కదిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం జలమయమైంది. గురువారం సాయంత్రం కదిరి పట్టణంలో భారీ వర్షం కురిసింది. దీంతో వర్షపు నీరు ఆలయంలోకి చేరింది. అప్రమత్తమైన ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు వర్షపు నీరు గర్భాలయంలోకి వెళ్లకుండా చర్యలు చేపట్టారు.



మడకశిర మండలం తురుకువాండ్లపల్లిలో పొలంలోనే కుళ్లిపోతున్న వేరుశనగ పంట



గుడిబండ మండలం ఫలారంలో పత్తి పంటలోకి చేరిన నీరు



చిలమత్తూరు: మరవకొత్తపల్లిలో టమాట పంటలో చేరిన వర్షపు నీరు



చెన్నేకొత్తపల్లి: వెల్దుర్తికి వెళ్లే దారిలో వంతెన పై నుంచి ప్రవహిస్తున్న చిత్రావతి నది

ప్రభుత్వం ఆదుకోవాలి



అప్పులు చేసి ఐదు ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాను. వేరుశనగ పంటలో కాయలు లేకపోయినా పశు గ్రాసం అయిన దొరకుతుందని పంటను తొలగించాను. తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు పొలంలోనే పంట మొత్తం తడిసిపోయింది. తొలగించిన పంట నల్లగా మారి పశుగ్రాసానికి కూడా పనికి రాకుండా పోయింది. పంటనష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.
– రవికుమార్, రైతు, తురుకువాండ్లపల్లి, మడకశిర

భావితరాలకు వాల్మీకి మార్గదర్శకుడు



వాల్మీకి జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

పుట్టపర్తి టౌన్: భావితరాలకు వాల్మీకి మహర్షి మార్గదర్శకులని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సాయి ఆరామంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ సువర్ణ , మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వాల్మీకి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాద్రి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వాల్మీకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముందుగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ మానవాళికి వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి ఆలోచనా విధానం ఎంతో గొప్పదన్నారు. రామాయణంలో బాల కాండను పిల్లలకు చెప్పాలని దాని ద్వారా పిల్లలు సభ్యత, సంస్కారం నేర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి నిర్మల, వాల్మీకి సేవా సంఘం జిల్లా అధ్యక్షులు వీసీ గంగన్న, సీనియర్ జర్నలిస్ట్ పుల్లయ్య, కవి ఉద్దండం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన కల్పించాలి



రీ సర్వేపై సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ప్రశాంతి నిలయం: ప్రజలకు రీ సర్వేపై అవగాహన కల్పించడంతో పాటు వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు శుక్రవారం నుంచి రీసర్వే అయిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి సర్వే అండ్ ల్యాండ్ అధికారులతో కలిసి డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలో వివిధ మండలాల్లోని 161 గ్రామాల్లో భూములు రీ సర్వే పూర్తయిందని, ప్రణాళికాబద్ధంగా షెడ్యూల్‌ను ఆయా గ్రామాల్లో ప్రజలకు తెలియజేసేలా దండోరా వేయించాలన్నారు. ఈ నెల 18 నుంచి నవంబర్ 4 వరకు సభలు నిర్వహించాలన్నారు. గ్రామసభల్లో విజ్ఞప్తులు స్వీకరించాలని, రీసర్వేతో నష్టపోయిన రైతులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి తదుపరి చర్యలకు సిఫారసు చేయాలన్నారు. జిల్లా సర్వే అధికారి విజయశాంతి బాయి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పన్నుపోటు.. ఫుల్ రేటు

మద్యం లెక్కల్లో మతలబు

- రకరకాల ట్యాక్సులతో భయపెడుతున్న సర్కారు
- రూ.6.66 లక్షల మద్యానికి రూ.4.61 లక్షల ఏఆర్‌ఈటీ ట్యాక్సు
- ఎక్సైజ్ డ్యూటీ పేరుతో భారీగా వడ్డన
- అదనంగా స్పెషల్ మార్జిన్, వ్యాట్, ఎస్‌ఎంపీ, పీడీ ట్యాక్సులు
- ఇన్‌వాయిస్ విలువతో పోలిస్తే నెట్‌వ్యాల్యూ 80 శాతం ఎక్కువ!
- లెక్కలు అంతుచిక్కక తలపట్టుకుంటున్న లిక్కర్ గోడౌన్ అధికారులు

ఒక మద్యం షాపు నిర్వాహకుడి సరుకు ఇచ్చిన ఇన్‌వాయిస్ ఇలా..

కేటగిరీ	విలువ
ఇన్‌వాయిస్ విలువ	రూ.6,66,815
స్పెషల్ మార్జిన్	రూ.21,832.68
ఏఆర్‌ఈటీ టాక్స్	రూ.4,61,714
టోటల్ ఈడీ	రూ.94,468.45
టోటల్ వ్యాట్	రూ.30,222.67
టోటల్ రేట్ ఆఫ్ ఎస్‌ఎంపీ	రూ.3,32,448.05
టోటల్ పీడీ	రూ.2,49,118.23
టీసీఎస్	రూ.11,565
మొత్తం సరుకు విలువ	రూ.11,67,971.4





అనంతపురం హౌసింగ్ బోర్డు వైన్‌షాపులో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మద్యం లెక్కల్లో సర్కారు మతలబు చేస్తోంది. రకరకాల ట్యాక్సులతో భయపెడుతోంది. బుధవారం రాత్రి పొద్దుపోయే వరకూ అనంతపురంలోని లిక్కర్ గోడౌన్ నుంచి శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని మద్యం షాపులకు లిక్కర్ సరఫరా చేశారు. ఇందులో ఒక మద్యం షాపు నిర్వాహకుడికి ఇచ్చిన ఇన్‌వాయిస్ కాపీలు పరిశీలిస్తే కళ్లు తేలేసినంత పనైంది. ఇన్‌వాయిస్ వ్యాల్యూ రూ.6.66 లక్షలుగా ఉంటే, అన్ని ట్యాక్సులూ కలుపుకుని నెట్ వ్యాల్యూ రూ.11.67 లక్షల వరకూ వేశారు. బీర్‌లు, విస్కీ, బ్రాందీ ఇలా అన్ని రకాల బ్రాండ్‌ల పైనా ఇన్‌వాయిస్ వ్యాల్యూతో కలుపుకుంటే మరో 80 శాతానికి పైగా నెట్ వ్యాల్యూ అధికంగా ఉంది. ఇండెంట్ ఇచ్చే లిక్కర్ గోడౌన్ అధికారులే ట్యాక్సులు, లెక్కల పట్టికలు చూసి ఆశ్చర్యపోయారు. ట్యాక్సులు దేనికి ఎంతనో తమకే అర్థం కావడం లేదంటూ తలలు పట్టుకున్నారు.

పొంతనే లేదు..

వాస్తవానికి ఇన్‌వాయిస్ వ్యాల్యూ ప్రకారం చూస్తే ఒక బీరు బాటిల్‌ను రూ.230కే విక్రయించాలి. అయితే, ఈ ధరకు, వినియోగదారుడికి చేరే ధరకు పొంతనే ఉండటం లేదు. రకరకాల ట్యాక్సులు వేయడంతో రూ.280 వరకూ కంపెనీని బట్టి ధరలు నిర్ణయించారు. విస్కీ, బ్రాందీ ధరలు కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో దేని రేటు ఎంతో గోడౌన్ అధికారులకు అంతుచిక్కలేదు. 'దీనిపై మాకు అవగాహన లేదు. కోడ్ నంబర్ వేస్తున్నాం. ధర వస్తుంది. అదే వేస్తున్నాం' అంటూ సమాధానం ఇస్తున్నారు.

దిగిపోతోన్న కిక్కు..

పెరిగిన ధరలు మద్యంప్రియులకు ఎక్కిన కిక్కు క్షణాల్లో దిగిపోయేలా చేస్తున్నాయి. ధరలు తగ్గిస్తాం , నాణ్యమైన మద్యం అందిస్తాం, రూ.99కే చీప్ లిక్కర్ ఇస్తాం అంటూ చెప్పిన చంద్రబాబు నిలువునా ముంచేశారని మందుబాబులు వాపోతున్నారు. ఈ నెల 15 నుంచి కొత్త మద్యం పాలసీ వచ్చింది. ధరలు తగ్గి ఉంటాయని 15వ తేదీ రాత్రినుంచే మద్యంప్రియులు షాపులపై ఎగబడ్డారు. చివరకు చూస్తే పాత మద్యం బాటిళ్లే. అందులోనూ పాత ధరల కంటే పది రూపాయలు ఎక్కువగా ఉండటం చూసి ఘొల్లుమన్నారు.

రేట్లు తగ్గించడమంటే ఇదేనా?



అనంతపురం హౌసింగ్‌బోర్డులో ఉన్న 104 వైన్‌షాపులో రేట్లు తగ్గించడం లేదని సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న వెంకటస్వామి

చంద్రబాబు సర్కారు మోసంపై గురువారం అనంతపురంలోని ఎస్‌ఆర్ వైన్స్ (షాపు నెం .14) వద్ద నిర్వాహకులతో వెంకటస్వామి అనే ఓ వ్యక్తి వాగ్వాదానికి దిగారు. ఎన్నికల ముందేమే రేట్లు తగ్గిస్తామన్నారు. నాణ్యమైన మద్యం ఇస్తామన్నారు. ఇప్పుడేమో ఏమీ చేయలేదు. అలవిగాని హామీలు ఇచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా షాపు నిర్వాహకులు కిమ్మనలేదు.

ఇన్‌వాయిస్, ఇండెంట్‌కు తేడా ఉంటుంది

వాస్తవానికి ఇన్‌వాయిస్ వ్యాల్యూకు, ఇండెంట్ వ్యాల్యూకు తేడా ఉంటుంది. ట్యాక్సుల రూపంలోనే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కానీ దీనిపై మాకు పెద్దగా అవగాహన లేదు. విజయవాడలో ఉన్న అధికారులు నిర్ణయించిన రేట్ల ప్రకారమే మేం ఇక్కడ రేట్లు నిర్ణయిస్తాం.
– వేణుగోపాల్‌రెడ్డి, లిక్కర్ గోడౌన్ అధికారి, అనంతపురం

క్లుప్తంగా

డీపీఓలో ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఉదయం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎస్పీ రత్న పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... వాల్మీకి మహర్షి ఔనత్యాన్ని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో జీవితంలో ఎదగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సీఐ ఇందిర, ఆర్ఐ వలి, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే అడ్వాన్స్ బుకింగ్ 60 రోజులకు కుదింపు

హిందూపురం అర్బన్: రైల్వే శాఖ అడ్వాన్స్ రిజర్వేషన్ బుకింగ్‌ను 120 రోజుల నుంచి 60 రోజులకు కుదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఐఆర్‌సీటీసీ నిబంధనల్లో మార్పు మేరకు ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. నవంబర్ 1 నుంచి నిబంధన అమలులోకి రానుంది. ఇప్పటి వరకూ ప్రయాణానికి 120 రోజుల ముందుగానే టికెట్ బుకింగ్ చేసుకునే సదుపాయం ఉండేది. ఇకపై ఈ వెసులుబాటును 60 రోజులకు కుదించారు. కాగా, ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదని రైల్వే వర్గాలు వెల్లడించాయి.

యువకుడి ఆత్మహత్య

రాయదుర్గం టౌన్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... స్థానిక డ్రైవర్స్ కాలనీలో నివాసముంటున్నమక్బూల్‌బాషాకు ముగ్గురు కుమారులు ఉన్నారు. మూడో కుమారుడు సర్వర్ బాషా(24) అలియాస్ లల్లు ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సర్వర్ బాషా పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా జబ్బు నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన గురువారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఎస్ఐ బాలరాజు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం
- ఖాళీగా దర్శనమిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు
- తెరుకోని వెబ్‌సైట్లు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



గత ప్రభుత్వంలో నిర్మించిన సచివాలయం


జిల్లాలోని మండలాలు	32
గ్రామ సచివాలయాలు	420
వార్డు సచివాలయాలు	124
ఒక్కో సచివాలయం నిర్మాణ ఖర్చు	రూ.40 లక్షలు
సచివాలయ ఉద్యోగుల సంఖ్య	5,224
వలంటీర్ల సంఖ్య	9,630

పుట్టపర్తి టౌన్: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ సిద్ధింపజేసింది. వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి సొంత గ్రామాల్లో వివిధ రకాల ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. నాడు ప్రజలకు ఎన్నో సేవలు అందించిన సచివాలయాల్లో నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. చంద్రబాబు పాలనకు ఐదు నెలలు కావస్తున్నా... ఇప్పటికే కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్య శ్రీ కార్డుల వెబ్ సైట్లు తెరుచుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. అలాగే వివిధ సేవలకు సంబంధించి సర్టిఫికెట్ల జారీలో కీలకంగా ఉన్న కంప్యూటర్ ప్రింటర్లు సైతం చాలా సచివాలయాల్లో పనిచేయడం లేదు. దీంతో అనేక మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నాడు అవహేళన చేసి...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నో ప్రతిష్టాత్మక సేవలను అందించిన సచివాలయ ఉద్యోగులను టీడీపీ నాయకులు పలుమార్లు అవహేళన చేస్తూ మాట్లాడారు. మహిళలను అక్రమ రవాణా చేసే వారిగా పేర్కొంటూ ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నమూ చేశారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. గతంలో ఒకటో తేదీ సూర్యోదయం కాక ముందే ఇంటి వద్దనే వలంటీర్లు ఠంచన్‌గా పింఛన్ అందజేసేవారు. ఇప్పుడు ఇదే పనిని కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో చేయిస్తోంది. అంతేకాక సచివాలయాల్లో సేవలను పూర్తిగా కుదించింది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు కట్టబెట్టి సచివాలయాలను నిర్వీర్యం చేసే కుట్రకు తెరలేపింది. ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించడం, పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం తదితర పనులతో మరోసారి సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. సీఎం చంద్రబాబు వైఖరి కారణంగా ప్రజలకు సంక్షేమ పథకాలు చేరువ చేయాల్సిన సచివాలయ ఉద్యోగులు నేడు ఎందుకూ పనికి రాకుండా పోయారు.

వైభవంగా యత్తప్పస్వామి క్షీరోత్సవం



యత్తప్పస్వామి మూలవిరాట్‌ను వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించిన దృశ్యం

రొళ్ల: మండలంలోని గంతికల్లు గొల్లహట్టి గ్రామంలో వెలసిన యాదవుల ఆరాధ్యదైవం యత్తప్పస్వామి ఉత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం క్షీరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఏటా దసరా తర్వాత ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం గొర్రెలు, ఆవుల కల్లం వద్దకు ఊరేగింపుగా వెళ్లి స్వామి ప్రతిమను పాలతో అభిషేకించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం డప్పు వాయిద్యాలతో ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేసి తీసుకుచ్చిన పాలతో స్వామిని అభిషేకించారు. అనంతరం మూలవిరాట్‌ను వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించారు. రాత్రి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కళారూపాలతో కళాకారులు ఆకట్టుకున్నారు.



అభిషేకించిన పాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటున్న యాదవులు

గ్రామ సర్పంచ్ సదాశివప్ప, ఎంపీటీసీ విశాలాక్ష్మి, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ ముదుపేగౌడు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

'విధి వంచితుల'కు మానవతావాదుల చేయూత

సాక్షి ఎఫెక్ట్..

రొద్దం: మండలంలోని రెడ్డిపల్లి హరిజన వాడకు చెందిన దుర్గమ్మ కుటుంబసభ్యులకు పలువురు మానవతావాదులు అండగా నిలిచారు. 'విధి వంచితులు' శీర్షికన గురువారం 'సాక్షి'లో వెలువడిన కథనం విదితమే. దీనిపై స్పందించిన మానవతావాదులు బాధితుడు నరసింహులు బావమరిది రామాంజనేయ ఫోన్‌పే నంబర్ 63623 74677కు రూ.70 వేల వరకూ ఆర్థిక సాయం బదలాయించారు. ఆర్థిక సాయం అందించిన దాతలకు నరసింహులు, ఆయన ఇద్దరు చిన్నారులు కృతజ్ఞతలు తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు సైతం స్పందించారు. గురువారం ఉదయం రెడ్డిపల్లిలోని హరిజన వాడలో నివాసముంటున్న దుర్గమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంబ స్థితిగతులు, వివరాలు సేకరించారు. ఐసీడీఎస్ శాఖ తరఫున ఆర్థిక సాయం అందించారు. అలాగే మహిళాశిశు సంక్షేమ శాఖ తరఫున అందే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయా పథకాల లబ్ధికి అవసరమైన సర్టిఫికెట్లను సేకరించుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పిల్లలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, జీఎంఎస్‌కే గౌతమి, అంగవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మృతురాలి కుమార్తెకు ఉచితంగా విద్యాబుద్ధులు చెప్పించేందుకు సత్యసాయి ట్రస్ట్ ముందుకు వచ్చింది. ఈ మేరకు మీ సేవా నిర్వాహకుడు నరేష్ తెలిపారు.



మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

సోమందేపల్లి: మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన తొలిరోజే ఓ వ్యక్తి అతిగా మద్యం తాగి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన గురువారం శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు... కోరిన బ్రాండ్...నాణ్యమైన మద్యం..అంటూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ ప్రచారం హోరెత్తించింది. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన మద్యం దుకాణాలను ప్రైవేటు పరం చేసి తాగినోళ్లకు తాగినంత మద్యం సరఫరా చేస్తోంది. ఈక్రమంలోనే బుధవారం ప్రైవేటు వ్యక్తులు దుకాణాలు ప్రారంభించగా...సోమందేపల్లి మండలం కొనతట్టుపల్లి గ్రామానికి చెందిన మహబూబ్ బాషా(32) సాయంత్రం సోమందేపల్లికి వెళ్లాడు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్దే రాత్రి వరకూ తాగాడు. రాత్రి ఇంటికి వెళ్లి పడుకున్నాడు. గురువారం మధ్యాహ్నం వేళ నిద్రలేచిన అతను.. తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబీకులు ఆటోలో చికిత్స కోసం సోమందేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో హిందూపురం ఆస్పత్రికి ఆటోలో తరలిస్తుండగా... మార్గమధ్యంలోనే మహబూబ్‌బాషా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూటమి సర్కార్ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్ చేసిందని, మద్యం కారణంగా ఇంకెన్ని మరణాలు చూడాలోనని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాలికకు వేధింపులు

- తగదని హితవు పలికినందుకు ఇద్దరిపై కొడవలితో దాడి



దాడిలో గాయపడిన వ్యక్తి

గార్లదిన్నె: మైనర్ బాలికపై వేధింపులు తగదని హితవు పలికిన ఇద్దరిపై ఓ యువకుడు కొడవలితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నెలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికతో మర్తాడుకు చెందిన గౌస్‌పీరా పరిచయం పెంచుకున్నాడు. కొంతకాలంగా తనను పెళ్లి చేసుకోవాలని గౌస్‌పీరా తరచూ వేధించేవాడు. ఇందుకు బాలిక అంగీకరించలేదు. ఈ క్రమంలో గత ఏడాది గౌస్ పీరాకు మరో అమ్మాయితో కుటుంబసభ్యులు పెళ్లి చేశారు. అనంతపురం శివారులోని టమాట మండీలో గౌస్‌పీరా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల తనను పెళ్లి చేసుకోవాలని మైనర్ బాలికను వేధిస్తుండడంతో విషయాన్ని కుటుంబసభ్యులతో చెప్పుకుని ఆమె బాధపడింది. దీంతో బుధవారం రాత్రి పెద్ద మనుషులను కలుపుకుని బాలిక బంధువులు గౌస్‌పీరాతో మాట్లాడారు. చదువుకుంటున్న బాలికపై వేధింపులు సరికాదని హితవు పలికారు. ఆ సమయంలో రెచ్చిపోయిన గౌస్‌పీరా కొడవలితో దాడికి తెగబడ్డాడు. ఘటనలో రాజు, బ్రహ్మయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం ఉదయం ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా విచారణ చేపట్టారు. వేధింపులు నిర్ధారణ కావడంతో గౌస్‌పీరాపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఏపీజీఎల్ఐ సమస్యలు పరిష్కరించాలి : ఏపీటీఎఫ్



జీఎల్ఐ డీడీ భాస్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించి ఏపీ జీఎల్ఐలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా శాఖ పక్షాన గురువారం ఏపీజీఎల్ఐ డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్‌ను ఆ శాఖ నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. మెచ్యూరిటీ అయిన బాండ్లకు సకాలంలో క్లెయిమ్ సెటిల్‌మెంట్ చేయడం లేదన్నారు. ఆరు నెలలుగా ఉపాధ్యాయుల మెచ్యూరిటీ క్లెయిమ్‌లు ఏపీజీఎల్ఐ ఆఫీస్‌లో మేకర్, చెక్కర్, అప్రూవల్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నూతనంగా ఏపీజీఎల్ఐ ప్రీమియం మొత్తాన్ని పెంచినా.. కొత్త బాండ్లను మాత్రం అసంపూర్తిగా జనరేట్ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. తప్పిదాలను సరి చేసేందుకు సరైన నిబంధనలు రూపొందించలేదన్నారు. కొత్తగా జారీ చేసిన బాండ్లన్నీ తప్పుల తడకగా ఉన్నాయన్నారు. ఆరు నెలలుగా లోన్లు విడుదల చేయడం లేదన్నారు. మెచ్యూరిటీ క్లైమ్ సెటిల్మెంట్లను, లోన్ ప్రాసెసింగ్ విధానాన్ని మరింత సరళతరం చేయాలన్నారు. జీఎల్ఐ మిస్సింగ్ క్రెడిట్ వెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, నాయకులు పి.రవికుమార్, గోపాల్‌నాయక్, ఆంజనేయులు, నాగశేషయన, కుళ్లాయిరెడ్డి, నాగేంద్ర, నాగరాజు, రఫీ, పుల్లప్ప పాల్గొన్నారు.

పురుగులు పడిన కందిపప్పు పంపిణీ



పురుగు పట్టిన కందిపప్పును పరిశీలిస్తున్న లబ్ధిదారులు

రొళ్ల: పురుగులు పడి పిండి అయిన కందిపప్పును గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసిన వైనం గురువారం ఉదయం రొళ్ల మండలం అవినకుంట అంగన్‌వాడీ కేంద్రంలో వెలుగు చూసింది. ఇంటికి వెళ్లిన తర్వాత ప్యాకెట్‌ను తెరిచి చూస్తే అందులో నుంచి పురుగులు బయటపడ్డాయి. దీంతో పలువురు లబ్ధిదారులు వెంటనే అంగన్‌వాడీ సెంటర్‌కు చేరుకుని నిలదీశారు. నాసిరకం సరుకుల పంపిణీపై ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ మంజునాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ తదితరులు అక్కడకు చేరుకుని ఆరా తీశారు. పురుగులు పడి పౌడర్‌గా మారిన 23 కంది బ్యాళ్ల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

● అధినేతతో భేటీ



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ కార్యకలాపాలపై వారు చర్చించారు.

పిడుగు పాటుకు వ్యక్తి మృతి



జయరాం (ఫైల్)

కదిరి అర్బన్: మండలంలోని కాళసముద్రం గ్రామంలో గురువారం రాత్రి పిడుగుపాటుకు జయరాం(49) అనే వ్యక్తి మృతిచెందాడు. పొలాల్లో ఎనుములను మేపుకుని సాయంత్రం ఇంటికి తోలుకుని వస్తుండగా మార్గం మధ్యలో పిడుగు రాలి అక్కడికక్కడే మృతి చెందాడు. వీఆర్ఓ రఘునాథరావు పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. కాగా, మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది.

తోటలో క్షుద్ర పూజలు



తోటలో పూడ్చిన నిమ్మకాయలు, రాగి రేకులు

ముదిగుబ్బ: మండలంలోని చిన్నకోట్ల గ్రామానికి చెందిన రైతు నారప్ప తోటలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారు. గురువారం ఉదయం తాను సాగు చేసిన జొన్న చేనులో ఓ చోట తవ్విన గుంతను గమనించిన నారప్ప... అక్కడ తవ్వి చూశాడు. అందులో నిమ్మ కాయలు, రాగి రేకులు బయటపడ్డాయి. దీంతో ఎవరో గిట్టని వారు క్షుద్రపూజలు చేసినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో సీఐ శ్యామరావు అక్కడకు చేరుకుని పరిశీలించారు. రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

ఆటోను ఢీకొన్న బొలెరో

మడకశిర: స్థానిక జాతీయ రహదారిపై ఆటోను బొలెరో ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు... మడకశిర మండలం గోవిందాపురం నుంచి మడకశిరకు ప్రయాణికులతో బయలుదేరిన ఆటో స్థానిక వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై పావగడ నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న వాసుదేవప్ప, రంగప్ప, రత్నమ్మ, శారద తదితరులు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

ఇసుక తోలుకోనివ్వండి : మంత్రి

పెనుకొండ: ఇసుకను ఉచితంగా ఎవరైనా తోలుకుంటే ఎలాంటి అభ్యంతరాలు తెలపరాదని పోలీసులు, రెవెన్యూ అధికారులను మంత్రి సవిత ఆదేశించారు. గురువారం పెనుకొండలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజలు తమ అవసరాలకు సమీప వంకలు, వాగుల నుంచి ఉచితంగా ఇసుకను ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో తరలిస్తుంటే అడ్డు చెప్పడం సరికాదన్నారు. అలాంటి వాహనాలను సీజ్ చేయడం, జరిమానాలు విధించడం మానుకోవాలన్నారు. అయితే ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

రైల్వే ఉద్యోగి బలవన్మరణం



మృతుడు మధుసూదన్

గుంతకల్లుటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఓ రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని అరవిందనగర్ రైల్వే క్వార్టర్స్ 599–బీలో మధుసూదన్ (34) రైల్వే కమర్షియల్ విభాగంలో ఓఎస్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య హేమావతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వర్క్‌ఫ్రం హోంలో భాగంగా ఇంటి వద్ద నుంచే ఆమె విధులు నిర్వర్తిస్తున్నారు. దసరా పండుగకు తన స్వగ్రామమైన ప్రొద్దుటూరు సమీపంలోని లింగాపురానికి కుటుంబసభ్యులంతా కలసి వెళ్దామని హేమావతిని మధుసూదన్ అభ్యర్థించాడు. ఇందుకు ఆమె నిరాకరించడంతో కుమార్తెతో కలసి లింగాపురానికి వెళ్లి రెండు రోజుల క్రితం తిరిగి వచ్చి యథావిధిగా తన విధులకు వెళ్లాడు. ఈ రెండు రోరజుల వ్యవధిలో దంపతుల మధ్య మనస్పర్థలు పెరిగి తరచూ గొడవ పడేవారు. దీంతో మనస్తాపం చెందిన మధుసూదన్ బుధవారం రాత్రి భోజనం ముగించుకుని బెడ్ రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకుని భార్య చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం భార్య తలుపు తట్టినా తీయకపోవడంతో స్థానికుల సాయంతో బద్దలు కొట్టి లోపలకెళ్లి చూశారు. అప్పటికే ఉరికి విగత జీవిగా వేలాడుతున్న భర్తను చూసి ఆమె బోరున విలపించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి సోదరుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, హేమావతి తనతో సఖ్యతగా ఉండడం లేదంటూ ఇటీవల సొంతూరికి వెళ్లినప్పుడు తన సోదరులతో మధుసూదన్ చెప్పుకుని బాధపడినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినట్లు సీఐ మనోహర్ తెలిపారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



డీఈఓ మీనాక్షికి వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

పుట్టపర్తి: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ టీచర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కూటమి సర్కార్‌ను యూటీఎఫ్ నాయకుడు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా గురువారం డీఈఓ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడచినా మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ పరిధిలోని టీచర్లకు లభించే అన్ని రకాల సౌకర్యాలు మున్సిపల్ టీచర్లకూ వర్తింపజేయాలన్నారు. మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత బోధనా సిబ్బందిని నియమించాలన్నారు. పీఎఫ్ ఖాతాలలో నిరుపయోగంగా ఉన్న సొమ్మును అవసరాలకు వాడుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. టీచర్ల బదిలీలతో పాటు నాన్ టీచింగ్ సిబ్బంది నియామకం వెంటనే చేపట్టాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈఓ మీనాక్షికి అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ, నరేష్‌కుమార్, అశ్వర్థ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.